

నేడు నిర్మలాశ్రమం 60వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ బొడ్డు చిన్నవెంకటయ్యపాలెం గ్రామంలో శ్రీధర నిర్మలాశ్రమం 60వ వార్షికోత్సవం గురువారం జరుగుతుందని ఆశ్రమ అధ్యక్ష, కార్యదర్శులు కొపనాతి బాలకృష్ణ, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ పలు రాష్ట్రాల నుంచి ఆశ్రమానికి సంబంధించిన శిష్యులు రానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గురువులకు సత్కారం, పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 29న విషయ నిర్ణయ సభ, మార్చి 1న వేదాంత వైజ్ఞానిక మహాసభ జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటలకు మేలుకొలుపు, ప్రభాత సేవ, గురు గీత పారాయణం ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

సానుభూతి కలిసొచ్చేనా..?

- దూకుడు పెంచిన సునీల్
- 4వ సారి పార్లమెంటులో పోటీకి సై

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

మూడు పార్టీల నుంచి వరుసగా హ్యాట్రిక్ ఓటమిని చవిచూసిన ప్రముఖ పారిశ్రామికవేత్త చలమలశెట్టి సునీల్ మరోసారి కాకినాడ పార్లమెంటు బరిలో నిలిచి పోటీకి సై అంటున్నారు. 4వసారి పోటీ చేస్తున్న ఆయన సానుభూతి ఓట్లపైనే పూర్తిగా ఆధారపడ్డారని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఈ మేరకు కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ గత పది రోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు.

ఇప్పటికే వైసిపి అధిష్టానం ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది. ఈ మేరకు గెలుపే లక్ష్యంగా సునీల్ వివిధ కార్యక్రమాలను చేపట్టారు. రెండు నెలల క్రితం కాకినాడ కేంద్రంగా మెగా జాబ్ మేళా నిర్వహించారు. పెద్ద ఎత్తున యువత హాజరయ్యేలా విస్తృతంగా ప్రచారం చేశారు. వేల మందికి వివిధ ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు వచ్చేలా ప్రయత్నం చేశారు. ఇలా మళ్లీ సునీల్ కోసం చర్చించుకునేలా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తాజాగా వచ్చే నెల 4న తన పుట్టిన రోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని జెఎన్‌టియు ఎదురుగా ఒక ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఏదో ఒక కార్యక్రమం ద్వారా జనం లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో ముఖ్యమైన కార్యకర్తలను ఆయన కలుసుకు న్నారు. సిట్టింగ్ ఎంఎల్‌ఎలతో సమావేశాలు నిర్వహించారు. వైసిపి ముఖ్య నేతలతో మంతనాలు జరుపుతున్నారు. వాలంటీర్లకు సన్మానాలు చేస్తూ నగదు, ఇతర బహుమతులు కూడా అందజేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిష్ట పార్టీల అభ్యర్థిని ఓడించి ఎలాగైనా గెలుపొందాలని ఆయన విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.



మూడు సార్లు పరాజయమే

చలమలశెట్టి సునీల్ వరుసగా మూడుసార్లు పార్లమెంట్ బరిలో దిగి మూడు ఎన్నికల్లోనూ మూడు పార్టీల తరుపున పరాజయం పాలయ్యారు. ఆయన అనుసరించిన తప్పిదాలతో పార్లమెంట్ లో అడుగుపెట్టే అవకాశాన్ని చేజార్చుకున్నారు. జర్మనీలో పారిశ్రామికవేత్తగా ఉన్న సునీల్ 2009లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటి ఎన్నికల్లో తొలిసారిగా ప్రజారాజ్యం తరుపున పోటీ చేశారు. అప్పట్లో టిడిపి తరుపున రంగంలో దిగితారని భావించిన చివరకు చిరంజీవి పార్టీలో చేరారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో వైసిపి నుంచి రెండోసారి కూడా పోటీ చేసినా ఓటమి తప్పలేదు. అప్పుడు అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. కొంతకాలానికి వైసిపికి దూరమయ్యారు. 2019 ఎన్నికల్లో వైసిపిని వీడి టిడిపిలో చేరి బరిలో దిగినప్పటికీ మూడోసారి కూడా ఓటమి తప్పలేదు. ఇప్పుడు టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సానా సతీష్ పోటీలో ఉండే అవకాశం ఉంది. కాకినాడ పార్లమెంటు సీటుని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతుంది. సానా సతీష్ ఆ పార్టీలో చేరి బరిలో ఉంటారని సమాచారం. సునీల్‌కు సతీష్ బాబు కొమ్మడు. ఇప్పుడు పార్లమెంట్ పోటీలో గురు శిష్యులు ఇద్దరు పోటీపడే అవకాశం కనిపిస్తుంది. వరుసగా మూడుసార్లు ఓటమి చవి చూసిన సునీల్‌కు ఈసారి విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెప్పుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపికి తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో సానుభూతి కలిసొస్తుందనే అంశంపైనే సునీల్ దృష్టి సారించారని విశ్లేషకులు భావిస్తున్నారు.



రైతులకు మూడో విడత పంట పెట్టుబడి మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

కిసాన్ పథకంలో రూ.36.33 కోట్లు జమ

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కిసాన్ పథకంలో మూడో విడతగా జిల్లాలో 1,80,609 మంది రైతుల ఖాతాలకు రూ.36.33 కోట్లను జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. బుధవారం సిఎం జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రైతులకు మూడో విడత ఆర్థిక సాయానికి సంబంధించి బటన్ నొక్కారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లాలో అర్హులైన 1,80,609 మంది రైతులకు రూ.36.33 కోట్లను వారి ఖాతాలకు జమచేస్తూ మెగా చెక్కును రైతులకు అందజేశారు. అలాగే రూ.1లక్ష లోపు రుణాలకు, నిర్ణీత గడువులోపు చెల్లించిన 34,270 మంది రైతులకు వడ్డీ రాయితీ పరిహారం రూ.5.35 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేస్తూ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ రైతు భరోసా - పిఎం కిసాన్ పథకంలో 2019 నుంచి 1,80,434 మంది రైతులకు రూ.1085.50 కోట్ల మేరకు పెట్టుబడి సాయం అందించినట్లు తెలిపారు. ఐదేళ్లలో మూడో విడతగా రూ.36.33 కోట్ల ఆర్థిక సహాయాన్ని రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 2021-22 రబీ, 2022 ఖరీఫ్‌లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 34,270 మంది రైతులకు రూ. 5.33 కోట్లు రైతుల తమ బ్యాంకు ఖాతాలో డిబిటి ద్వారా సొమ్ము జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బివిఎస్‌ఎస్.హరి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.మల్లికార్జునరావు, ఎపిఎంఐపి పిడి జివివివి.ప్రసాదరావు, వ్యవసాయ అధికారులు గాయత్రి, లబ్ధిదారు రైతులు పాల్గొన్నారు.

కొనసాగిన శానిటేషన్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

జిజిహెచ్ శానిటేషన్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న పోరాటం 26వ రోజు కొనసాగింది. ఈ పోరాట సందర్భంగా జిజిహెచ్ తల్లి పిల్ల బొమ్మ వద్ద ధర్నా చేసి అనంతరం హాస్పటల్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సిఐటియు కోశాధికారి మలకా వెంకటరమణ అధ్యక్షత వహించారు. శానిటేషన్ కార్మికుల సమస్యపై 26 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న పరిష్కారం దిశగా కాంట్రాక్టర్ దృష్టి సారించడం లేదన్నారు. గురువారం నుంచి పోరా టం మరింత ఉధృతం చేయడానికి కార్మికులు సిద్ధమ వుతున్నారన్నారు. బుధవారం సంప నాయ కులతో కాంట్రాక్టర్ చర్చలు జరిపారని, అయితే కార్మికులకు ఆమోదయోగ్యం కాకపోవడంతో తమ ఆందోళనను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కూడా కాంట్రాక్టర్ కార్మిక నాయకులతో చర్చలు చేసినా కార్మికుల అంగీకరించే విధంగా చర్చలు లేవని అందుచేత పోరాటాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.విజయ కుమార్, శేషు, రమేష్, వాసు, రవి, శ్రీకాంత్, లక్ష్మీ ప్రియ, కుమారి, పుష్ప, చంద్రకళ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

వేగంగా రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రైల్వే ఉత్తర క్యాబిన్ వద్ద నుంచి రైల్వే ట్రాక్ మరమ్మత్తు పనులు జోరుగా జరుగు తున్నాయి. ఈ కారణంగా రైల్వే గేట్ బుధవారం మూత పడింది. రైల్వే అధికారులు ముందుగానే ప్రకటించిన రీతిగా ట్రాక్ మరమ్మతు పనులను ఉదయం ప్రారం భించారు. దానితో ప్రయాణి కులకు ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాక్ వద్ద సుమారు ఐదులైన్ల వద్ద ఉన్న బల్లాస్ట్, రైలు పట్టాలు మార్పిడి పనులు వేగవం తంగా జరుగుతున్నాయి. మార్చి 6వ తేదీ సాయం త్రం వరకూ ట్రాక్ మరమ్మతు పనులు కొనసాగ నున్నట్టు అధికారులు చెప్పారు. గేటు మీదుగా వెళ్లే వాహనాలను రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్లించారు. అయితే ప్రధానంగా వాహనాల మాటేలా ఉన్నా రైతులు, పశువులకు రైలు గేటు మీదుగానే రాకపోకలు అలవాటు కావడంతో ఆమేరకు వారికి ఇబ్బందులు తప్పడం లేదు.



రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - కోటనందూరు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇవిఎంల ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు హక్కు లేని వారు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం మెప్మా ప్రతినిధులు ఇవిఎంల ద్వారా ఓటు వినయోగించుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రంగోలీ పోటీలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు.



తుని మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ



అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

అమరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలి

ప్రజాశక్తి - కాకినాడ

అమరుల ఆశయ సాధన కోసం ఉద్యమించిన నాడే అమరవీరలకు నిజమైన నివాళి అని సిపిఎం నాయకులు అన్నారు. సిపిఎం జిల్లా నాయకులు ఇనుగంటి నారాయణరావు, జిఎస్. బాలాజీదాస్, గుండాపు చిట్టియ్య, బిబి. నాయుడు వర్ధంతి కారక్రమం బుధవారం స్థానిక సుందర య్య భవన్‌లో జరిగింది. సిపిఎం నాయకులు కె.వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఒకే నెలలో నలుగురు నాయకులు మృతి చెందారని గుర్తు చేశారు. ఇనుగంటి నారాయణ రావు, జిఎస్.బాలాజీ దాస్ సిపిఎం జిల్లా కార్యదర్శులుగా పని చేశారని, బిబి. నాయు డు సిఐటియు ఉద్యమ నాయకుడని, గుండాపు చిట్టియ్య ఉపాధ్యాయ ఉద్యమ నాయ కుడిగా పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సిహెచ్. రమణి, సిహెచ్.అజయ్‌కుమార్, కె.సిం హాచలం, పి.రామకృష్ణ, జుత్తుక శ్రీనివాస్, టి. రాజా, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. లెనిన్ జీవితం-కృషి పుస్తకంపై అధ్యాయనం జరిగింది.

పోలియో చుక్కల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

పోలియో రహిత సమాజం నిర్మించేందుకు మార్చి 3న 0-5సంవత్సరాల వయసు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, బాలల ఆరోగ్య పరిరక్షణ అధికారి డాక్టర్ కె.రత్నకుమార్ పిలుపునిచ్చారు. జిల్లాలో పల్స్ పోలియో నిర్వహణకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు 6.12 లక్షల డోసులు పల్స్‌పోలియో వాక్సిన్లు సిద్ధం చేశామన్నారు. ఇందులో తూర్పుగోదావరి జిల్లాకు-1,34,574, కాకినాడ జిల్లాకు 2,43,120, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 1,86,660, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 54,646, కేంద్ర పాలిత ప్రాంతం యానాం-సుమారు 5వేల వ్యాక్సిన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కాకినాడ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 1,30,144మంది, పట్టణ ప్రాంతాల్లో 64,188 మంది మొత్తం 1,94,332మంది 0-5సంవత్సరాల వయసు గల చిన్నారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే పల్స్ పోలియో కేంద్రానికి రాలేని చిన్నారులు 17,765 మంది ఉన్నారని తమ సిబ్బంది వారి వద్దకే వెళ్ళి పోలియో చుక్కలు అందిస్తారని తెలిపారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 1374 పోలియో కేంద్రాలు, 48 మొబైల్ టీములు ఏర్పాటు చేశామన్నారు.1976 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 1442 మంది ఆశా కార్యకర్తల సేవలు వినియోగించుకుంటామని తెలిపారు. మార్చి 3వ తేదీ ఆదివారం పోలియో కేంద్రాలతోపాటు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రయాణ సమయంలో ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ఇంకా మిగిలిపోయిన చిన్నారులకు 4, 5 తేదీల్లో పోలియో చుక్కలు వేస్తామన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు ఒక్క పోలియో కేసు కూడా జిల్లాలో నమోదు కాలేదన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మార్చి 1న చలో కలెక్టరేట్‌కు పిలుపు

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 1న నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దాపురం, దివిలి గ్రామాల్లో బుధవారం చలో కలెక్టరేట్‌కు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును కొనసాగించాలని, బకాయి క్లయమ్‌ల పరిహారాలు చెల్లించాలని, సంక్షేమ బోర్డు పథకాలను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధి సొమ్ము రూ.2500 కోట్లు పక్కదారి పట్టించారన్నారు. హక్కుల సాధన కోసం మార్చి 1న జరిగే చలో కలెక్టరేట్‌లో పెద్దఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.క్రాంతికుమార్, జక్కాని అబ్బు, బైలపూడి నూకరాజు, పోలిపర్తి భద్రరావు, మాగాపు నాగు, రేలంగి వెంకట్రావు, దేవా పాల్గొన్నారు.

కూలి రేట్ల కోసం హమాలీల ధర్నా

ప్రజాశక్తి - సామర్లకోట

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలంటూ బేవరేజెస్ హమాలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. ఎపి బేవరేజ్ హమాలిస్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ప్రత్తిపాడు రోడ్ లోని సామర్లకోట బేవరేజ్ డిపో దగ్గర హమీలీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్య దర్శులు బి.ఆదినారాయణ, వి.అప్పలరాజు, ఉపాధ్యక్షులు విప్పర్తి కొండలరావు పాల్గొన్నారు..



బేవరేజ్ డిపో వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

కార్పొరేట్ కంపెనీల కోసం బడ్జెట్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

దేశంలోని కార్పొరేట్ కంపెనీల కోసమే కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు బడ్జెట్లును ప్రవేశపెడుతున్నట్లుగా ఉన్నాయని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో యుటిఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ 9వ వర్ధంతి సభ యుటిఎఫ్ నాయకులు కెనడి అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బడ్జెట్‌లు ప్రతిపాదించినప్పుడు ఏ వస్తువుల ధరలు పెరుగు తాయో, తగ్గుతాయో అనే ఆసక్తి ప్రజల్లో ఉండేదన్నారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లు వస్తువుల ధరలు పెరగటం, కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కోసమే అన్నట్లుగా పరిమితం అయ్యాయని తెలిపారు. బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని దుయ్యబట్టారు. తొలుత లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జోషుల కృష్ణబాబు, రొంగల వీర్రాజు, సీతారామారావు, బి.అనంతరావు పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘీయులు

బాధితులకు కుడుపూడి సాయం


ప్రజాశక్తి - తాళ్లరేవు

అగ్ని ప్రమా దంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిం చారు. ఇటీవల తాళ్లరేవు చెరు వుగట్టు సెంటర్లో మట్ట పర్తి తాతారావుకు చెందిన దుకా ణం అగ్నిప్రమాదంలో దహనం అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న ఆయన బుధవారం బాధితుడికి ఆర్థిక సాయాన్ని అందించారు. తన స్నేహితుల ద్వారా మరికొంత సహాయాన్ని అందజేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవ స్వామి దేవస్థానం చైర్మన్ కొల్లు శ్రీనివాస్, తాళ్లరేవు సిహెచ్‌సి డైరెక్టర్ బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, హైస్కూల్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి మల్లేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నగదును అందిస్తున్న కుడుపూడి

కార్టూన్ 'నిజం'



ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లాలోని పలు మండలాల్లోని వివిధ విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. **కాకినాడ** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి డాక్టర్ పిఎస్.రంజిత్ మాట్లాడారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సైన్స్ విభాగాల అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందిం చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి



కాకినాడ నారాయణలో విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన

విఎస్ఎన్.కుమార్ పాల్గొన్నారు. అలాగే స్థానిక గాంధీనగర్ తిరుమలరావు వీధిలోని నారాయణ హైస్కూల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జి.సునీల్, స్కూల్ కరెస్పాండెంట్ టిఎస్‌వి. నారాయణ, ప్రిన్సిపల్ నారాయణ, ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక పి.వెంకటా పురంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ అభివృద్ధి అనే విషయంపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. **కరప** మండలం లోని గురజానపల్లి పబ్బినీడి పాపారావు జడ్‌పి హైస్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాయి మోహన్, వివి రమణమూర్తి, సోబాకర్, ఎన్.ప్రభారాణి, భవాని పాల్గొన్నారు. **అన్నవరం** స్థానిక శారద విద్యాలయంలో జాతీయ బాలల సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ కర స్పాండెంట్ కె.కృష్ణవర్మ ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ బోనగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బచ్చు ఫౌండేషన్ మునిసిపల్ హైస్కూల్‌లో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం రాజు పర్యవేక్షణలో సైన్స్ సంబరాలు నిర్వహించారు. క్విజ్, రంగోలి, సైన్స్ మ్యాజిక్ షో, సైన్స్ స్కిట్స్, డిబేట్, ప్రాజెక్ట్‌ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కాజులూరు** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ దినోత్సవంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస వినీల్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనల్లో విజేతలకు శ్రీనివాస వినీల్, గ్రామ ఉపసర్పంచ్ దండంగి చిన్నారావు, పాఠశాల చైర్మన్ కోన రాధాకృష్ణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు శామ్యూల్ బెన్‌హర్, హరినాథ్ మాట్లాడారు. **పెద్దాపురం** స్థానిక రామారావు పేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రొఫెసర్ సంతానం, అకాడమిక్ కో-ఆర్డినేటర్స్ హర్షిత్‌కుమార్‌రాయ్, ప్రశాంతి ఆధ్వర్యంలో సివి.రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య నాయుడు

కార్మికుల వేతనాల పెంపుదలకు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వలసపాకలో పంచాయతీ కార్మికుల వేతనాలు గత రెండేళ్లుగా పెంపుదల చేయడం లేదని తక్షణమే జీతాలను పెంపుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ సత్యనారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ కన్వీనర్ టి. రాజా, కో- కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ వలస పాకల పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత రెండు సంవత్సరాల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. పంచాయతీకి పరిశ్రమల ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్న కార్మికులకు మాత్రం వేతనాలు పెంచడం లేదన్నారు. పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

ఉమ్మడి సభకు తరలిన టిడిపి, జనసేన శ్రేణులు

ప్రజాశక్తి - గండేపల్లి

తాడేపల్లిగూడెంలో బుధవారం జరిగిన జెండా సభకు టిడిపి, జనసేన పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపు మేరకు తరలివెళ్లిన వాహనాలకు మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు జండా ఊపి ప్రారంభించారు. మురారిలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోర్పు లచ్చయ్యదొర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, అడబాల భాస్కరరావు, గోరజాల వెంకన్న దొర, సూరంపాలెం బాలు, నల్లల శివ, తదితరులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సిఐ లక్ష్మణరావు

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలపై ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సిఐ లక్ష్మణరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆటో డ్రైవర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ ఆటోలు నడిపే ఆటో డ్రైవర్లు, పరిమితికి మించి స్కూల్ విద్యార్థులను ఎక్కించరాదని తెలిపారు. ఆటో డ్రైవర్ తప్పనిసరిగా తమ ఆటోకు కుడివైపు భాగాను, గ్రిల్స్‌తో క్లోజ్ చేయాలని సూచించారు. స్కూల్ ఆటోలకు బయట భాగంలో కుడి, ఎడమ మరియు వెనుక వైపు ఎటువంటి స్కూల్ బ్యాగ్‌లను, క్యారేజ్ బ్యాగ్‌లను వేలాడదీయరాదని అన్నారు. తమ పిల్లలను పరిమితికి మించి తీసుకెళ్తే ఆటోలకు పంపించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రామారావు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎన్నికల విధుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒ జె.సీతా రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్ వద్ద తాగునీరు, విద్యుత్తు, ర్యాంపులు వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెండు రోజులపాటు జరిగిన శిక్షణ తరగతులకు హాజరుకాని ఐదుగురు బిఎల్‌ఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఇవిఎం పనితీరు, ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లపై మాస్టర్ ట్రైనీస్ జాన్ కెన్నడి, సీతారామారావు, శ్రీనివాస్ తదితరులు అవగాహన కల్పించారు.

తోటకూర సోదరులకు పలువురు పరామర్శ


తోటకూర సోదరులకు సానుభూతి వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, తోటకూర గంగాధర్, సత్యనారాయణలను పలువురు పరామర్శించారు. ఇటీవల వారి మాతృమూర్తి మృతి చెందిన నేపథ్యంలో బుధవారం మునిసిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, కౌన్సిలర్ పాగా సురేష్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పిఎన్‌వి. ప్రసాద్, పాలపర్తి కృష్ణారావు, ఆదిత్య సిబ్బంది తదితరులు వారిని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వికలాంగ విద్యార్థికి ఎంఆర్ కిట్ పంపిణీ


కిట్‌ను అందిస్తున్న హెచ్‌ఎం శివజ్యోతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థాని భవిత కేంద్రానికి విద్యార్థికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్(ఎంఆర్‌కిట్స్)ను బుధవారం హెచ్‌ఎం శివజ్యోతి అందించారు. ఈ సందర్భంగా సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు మాట్లాడుతూ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటలీ హ్యాండీక్యాప్డ్(నెల్లూరు) ద్వారా జిల్లావ్యాప్తంగా 28 ఎంఆర్‌కిట్స్ రాగా స్థానిక భవిత కేంద్రానికి చెందిన పడాల ధర్మతేజకు ఒక కిట్‌ను అందించినట్లు తెలిపారు. ఈ కిట్టు ద్వారా అత్యంత సులభంగా బాలలకు ప్రత్యేక విద్యా బోధన జరుగుతుందన్నారు.

అంజి డైరీపై అధికారుల తనిఖీలు


తనిఖీలు చేపడుతున్న అధికారులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి రాగంపేట పరిధిలో ఉన్న అంజి డైరీపై బుధవారం విజిలెన్స్, తూనికలు కొలతలు, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ముద్ర లేకుండా కాటా వాడుతున్నట్లు, 15 కేజీల నెయ్యి, పామాయిల్ డబ్బాలపై ధరల వివరాలు లేకపోవడం, నిర్ణీత బరువు కన్నా తక్కువ ఉన్నట్లు గుర్తించడంతో మూడు కేసులు నమోదు చేశారు. నెయ్యి, ఆయిల్ శాంపిల్స్ సేకరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ జనార్దన్‌రెడ్డి, ఎఒ భార్గవ మహేష్, కాకినాడ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు,పెద్దాపురం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖర్చుల అంచనాలపై అభ్యంతరాలు

వాడి వేడిగా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

ప్రజాశక్తి - సామర్లకోట

అజెండాలో నమోదు చేసిన పలు ఖర్చులకు సంబంధించిన అంచనాలపై అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన వాడీ వేడిగా జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందుగానే జీరో అవర్ కావాలని సభ్యులు కరణం రాజ్ కుమార్, రెడ్డం సునీత పట్టుబట్టారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్‌పర్సన్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు ఫిర్యాదు చేసిన సమస్యలపై పట్టించుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు అంశాలకు చెందిన ఖర్చులపై పలువురు అధికార పార్టీ సభ్యులు సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలో 1, 7, 20 అంశాలను వాయిదా వేసి మిగిలిన అంశాలను చర్చించి ఆమోదించారు. అజెండాలో పలు అంశాలపై సభ్యులు నేతల హరిబాబు, పిల్లాడి సత్యవతి, పితాని కృష్ణ, పిట్టా సత్యనారాయణ, సేపేని సురేష్ తదితరులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. దీనిపై వైస్ చైర్మన్ ఊబ జాన్‌మోజెస్ మాట్లాడుతూ అధికారులు సభ్యులకు పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు కో ఆప్షన్ పదవి ఇచ్చిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబుకు, కౌన్సిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు


సామాజిక తనిఖీల్లో వివరాలసేకరిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

100 రోజుల పనుల ప్రతిపాదనలకు పిలుపు


ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో కూలీలకు 100 రోజుల పనుల కల్పనకు ప్రతిపాదనలను సిద్ధ: చేయాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండల స్థాయి సమీక్షా సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మార్చి నెల నుంచి జూన్ వరకు అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను కూలీలకు కల్పించేందుకు ప్రతిపాదనలను రూపొందించాలని తెలిపారు. రైతాంగానికి ఉపయోగపడే నీటి కుంతలు, బోదులు తీయడం, చెరువు గట్ల మీద కొబ్బరి మొక్కల పెంపకం, వంటి పనులు రూపొందించాలన్నారు. ఈ సామాజిక తనిఖీలో భాగంగా ఆయా పనులకు సంబంధించి రూ.10 వేలు రికవరీ చేసినట్లు పీడీ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి వసంత మాధవి, ఎపిఒ అన్నపూర్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, వైసిపి నాయకులు రాయుడు గంగాధర్, చిట్టూరి చలపతి సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు..

వృత్తి నైపుణ్యం పెంపుదలతో ఉపాధి

ప్రజాశక్తి - యంత్రాంగం

టైలర్స్ డే సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో విలియన్స్ హౌ వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. **ఏలేశ్వరం** టైలర్స్ డే పురస్కరించుకుని ఏలేశ్వరంలో కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హౌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టైలర్లు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని, చంద్రబాబు హయాంలో చేతివృత్తిదారులకు మంచి ప్రోత్సాహం లభించేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు మూదీ నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి, టిడిపి నాయకులు నిమ్మకాయల నారాయణ, భజంతుల మణి, మామిడి లలిత, టైలర్ సంఘం నాయకులు దొంతం శెట్టి బాబు రావు, మచ్చ నాగేశ్వరరావు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానికంగా జరిగిన టైలర్స్ డే వేడుకల్లో విలియన్స్ హౌ వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టైలర్స్ యూనియన్ అధ్యక్షులు పసగాడ సోమేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఆధునిక కాలంలో టైలర్స్ పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కింతాడ వెంకటరమణ, కార్యదర్శి కేసుబోయిన నాగేశ్వరరావు పలు వురు దర్జీలు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులోని చిన్నారావు టైలరింగ్ షాప్ వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం టైలర్స్ యూనియన్ అధ్యక్షులు గుడివాడ కనకరత్నం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. యూనియన్ మాజీ అధ్యక్షులు ఆకుల రామారావు జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అల్లాడ రాఘవ రావు, అల్లక వీరభద్రరావు, జలగం సత్తిబాబు, జెట్టి రవి, ముత్తుక వెంకటేశ్వరరావు, సక్కురి కనకరాజు, బసవ లింగం, భీమేశ్వరరావు, పెదిరెడ్ల రాంబాబు పాల్గొన్నారు.**గండేపల్లి** మండలంలోని మురారిలో టైలర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వంకా సత్యనారాయణ మాట్లాడుతూ 1982లో శ్రీ వెంకటేశ్వర టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసి, నాటి నుంచి టైలర్స్ డే ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉప్పనపల్లి ధర్మరాజు, గిడుతూరి వెంకటేశ్వరరావు, ఆలేటి కృష్ణ, కోట దుర్గారావు, అయినవిల్లి సాంబశివ, గుదే సాయి పాల్గొన్నారు. **కోటనందూరు** నూకాంబికా టైలర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోవిందు ఆధ్వర్యంలో టైలర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గోవిందు టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె మేరా, ఎం.నాగబాబు, జి.సత్యనారాయణ, ఇ.వరహాలు, ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో విలియమ్స్ హౌ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సత్యప్రభ



కోటనందూరులో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు గోవిందు

పిఠాపురం బరిలో జనసేనాని..?

- ఖాయమంటూ జోరుగా ప్రచారం
- రసవత్తరంగా మారనున్న రాజకీయం
- విలక్షణ ఓటరు తీర్పు ఎవరిని వరించేనో..



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్న స్థానంపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచే ఆయన బరిలో నిలుచుంటారని ఆ పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పోటీ దాదాపుగా ఖాయమైనట్లుగా నియోజకవర్గంలో ప్రచారం జోరుగా సాగుతోంది. తొలుత ఆయన భీమవరం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల అధినేతల ఇద్దరి మధ్య జరిగిన చర్చల సందర్భంగా పిఠాపురం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు పవన్ తేల్చి చెప్పడంతో ఇక పోటీ పక్కా కావడంతో పిఠాపురం రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రంలోనే విలక్షణ రాజకీయాలకు ఈ నియోజకవర్గం పెట్టింది పేరు. ఓటర్లు కూడా ప్రధాన పార్టీల కన్నా ఇతరులకే పట్టం కట్టడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ఈ నియోజకవర్గం ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటుంది.

నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో పవన్ కళ్యాణ్ సామాజిక తరగతికి చెందిన వారే దాదాపు 92 వేల మంది ఉన్నారు. గతంలో ప్రజారాజ్యం విజయం సాధించిన నియోజకవర్గం కావడంతో మరోసారి జనసేనకు అవకాశం ఉంటుందనే అంచనాలతో జనసేన ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ నుంచి పోటీ చేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చునని పవన్ భావిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6 నుంచి 7 అసెంబ్లీ సీట్లలో, కాకినాడ పార్లమెంటు నుంచి జనసేన పోటీ చేసే అవకాశం ఉండడంతో పవన్ ఇక్కడ పోటీ చేయడం ద్వారా ఆ నియోజకవర్గాలపై కూడా ప్రభావం చూపి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని శ్రేణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆది నుంచి జనసేన కాకినాడ జిల్లాపై దృష్టి పెట్టింది. వారాహి యాత్ర కూడా ఇదే జిల్లా నుంచి ప్రారంభించారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ మూడు రోజులు పాటు బస చేసి సమీక్షలు జరిపారు. వచ్చే ఎన్నికల్లో బరిలో నిలుచునేందుకు తగ్గట్టుగా ఆ పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. పవన్ కళ్యాణ్ పర్యటనకు అనుకూలంగా నియోజవర్గ పరిధిలో ఉన్న గొల్లప్రోలులో సుమారు 4 ఎకరాల స్థలాన్ని హెలిప్యాడ్ కోసం లీజుకు తీసుకున్నారు. పవన్ ఇక్కడ ప్రచారం చేసేందుకు వీలుగా బస ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

విలక్షణ తీర్పు ఎవరివైపు

ఈ నియోజకవర్గంలో 1989 తర్వాత కాంగ్రెస్, 1994 తర్వాత టిడిపి గెలిచిన దాఖలాలే లేవు. 2014 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన టిడిపి తిరుగుబాటు అభ్యర్థి ఎస్‌విఎస్ఎస్.వర్మ విజయం సాధించగా, అంతకుముందు 2009లో ప్రజారాజ్యం తరుపున వంగా గీత ప్రాతినిధ్యం వహించారు. 2004లో బిజెపి అభ్యర్థిగా పెండెం దొరబాబు, 1999లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సంగిశెట్టి వీరభద్రరావు విజయం సాధించారు. గత ఎన్నికల్లో (2019) వైసిపి నుంచి పెండెం దొరబాబు గెలుపొందారు. దీంతో గడిచిన మూడు దశబ్దాలుగా విలక్షణ తీర్పులతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ఓటర్ల వైఖరి ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇదిలా ఉండగా ఈసారి ఎన్నికలకు ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ వర్మ టికెట్ ఆశిస్తున్నారు. జనసేన ఇన్‌చార్జ్ ఉదయ శ్రీనివాస్ తనకే టికెట్ అంటూ నియోజవర్గం అంతా ఇప్పటికే ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో వీరు ఇద్దరి ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. వైసిపి నుంచి కాకినాడ ఎంపి వంగా గీత బరిలో ఉంటున్నారు. ఆమె గతంలో ప్రజారాజ్యం తరపున ఇక్కడే ఎంఎల్ఎగా గెలిపొందారు. ఆ అనుభవంతో నియోజకవర్గంలో ఉన్న పరిచయాలతో ఆమె గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను సైతం ఓడించి తప్పకుండా విజయం సాధిస్తానని అంచనాతో ఆమె వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పిఠాపురం రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కనిపిస్తున్న తీవ్రమైన పోటీ చివరకు ఎలాంటి ఫలితాలనిస్తుందో వేచిచూడాల్సిందే.

రాష్ట్ర వాటా కోసం దశల వారీ పోరాటం

ప్రజాశక్తి - కాకినాడ

కృష్ణా గోదావరి బేసిన్లో రాష్ట్ర వాటా కోసం దశలవారీ పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. బుధవారం స్థానిక గాంధీభవన్లో కెజి బేసిన్ గ్యాస్ చమురు వాటా ఎపికు దక్కాలని కోరుతూ సిపిఐ- కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్ తాటిపాక మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్, సిపిఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, పౌర సంక్షేమ సంఘం, మేధావుల సంఘం, వివిధ ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ నాలుగు జిల్లాల్లో గ్యాస్ సమురు వ్యాపించి ఉన్నదని, ఇది ఉపరితలపరంగా చూస్తే 28 వేల సదరపు కిలోమీటర్లలోనూ, సముద్ర గర్భంలో 24 కిలోమీటర్ల పరిధిలో ఉందన్నారు. ఒఎన్‌జిసి 1956 ఆగస్టు 14న చమురు, గ్యాస్ నిక్షేపాల కోసం పరిశోధనలు ప్రారంభించిందని తెలిపారు. 1978లో నరసాపురం వద్ద మొదట బావిని తవ్వి గ్యాస్‌ను కనుగొన్నదని, ఆనాడు గ్యాస్ వాటా కోసం వైఎస్.రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేశారని, పలు ఉత్తరాలు ఢిల్లీకి రాశారని, చివరికి ఆయన మరణం కూడా దీని వల్లే జరిగిందనే ప్రచారం ఉందన్నారు. కానీ నేడు సిఎం జగన్ కేజీ బేసిన్ గ్యాస్‌పై నోరు మెదపక పోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఎండి జవహర్ ఆలీ, పిసిసి ఉపాధ్యక్షులు మట్టా శివప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ కె.కృష్ణమోహన్, సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి, పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు, తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరిగే ఉద్యమాన్ని విద్యార్థి, యువజన, కార్మిక, రైతు అన్ని వర్గాల వారు జయప్రదం చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న డేగ ప్రసాద్

100 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని కలవలపల్లి గ్రామ శివారులో పోలీసులు చేసిన దాడిలో 100 లీటర్ల నాటు సారాను స్వాధనం చేసుకున్నారు. అలాదే దాడిలో సారీ తయారీకి నిల్వ చేసిన బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతోపాటు, ఒక గ్యాస్ స్టవ్‌ను స్వాధీనం చేసుకున్నాడు. నాటు సారా తయారీచేస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నాడని, ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రామారావు

ఓటు హక్కుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - సామర్లకోట

18 సంవత్సరాల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు పిలుపునిచ్చారు. స్థానిక మెప్మా భవనంలో బుధవారం ఓటు హక్కు సద్వినియోగం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హత కల్గిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటు హక్కు సద్వినియోగంపై సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటి మిషన్ మేనేజర్ సుజాత, సిఒలు నర్గీస్, ప్రసాద్, శేఖర్, రిసోర్స్ పర్సన్స్, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్టలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని తిమ్మా పురం గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ పున ప్రతిష్ట గ్రామ సర్పంచ్, జెఎన్‌టియు ఎగ్జిక్యూటివ్ బోర్డ్ మెంబర్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, రూరల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ చలమలశెట్టి సునీల్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లచ్చారావు, ఆలయ ఇఒ, అర్చకులు వారికి స్వాగతం పలికారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 300 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ దేవాలయం అభివృద్ధి చెందడానికి ఎంఎల్ఎ కన్నబాబు కృషి ఫలితమేనని అన్నారు. కురసాల కన్నబాబు, సునీల్ మాట్లాడుతూ సిజిఎఫ్ నిధులు రూ.50 లక్షలు, దాతలు ఇచ్చిన విరాళాలు రూ.75 లక్షలతో ఆలయాన్ని పునప్రతిష్ట చేసుకోవడం ఆనందకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్‌లార్డ్ రావు రవికిరణ్, వైసిపి నాయకులు ముత్యాల సతీష్, రమణతి మురళి, పబ్బినీడి పాపారావు, తోటకూర శ్రీనివాస్, కోమల సత్యనారాయణ, కాళ్ల చంటి, బెజవాడ బ్రదర్స్,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వ్యవసాయ విద్య కోర్సులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆచార్య ఎన్ జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తి కోసం సార్వత్రిక, దూరవిద్య ద్వారా రైతులకు, మహిళలకు, యువతకు సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించిందని పెద్దాపురం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.వెంకటనరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం, సేంద్రీయ వ్యవసాయం రెండు ఆన్‌లైన్ కోర్సులు ఈ ఏడాది ఏప్రియల్ నుంచి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కోర్సులు 8 వారాల వ్యవధిలో నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు రూ.1500 ఫీజు చెల్లించి కోర్సుకు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం ఉండాలని, పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవచ్చున్నారు. మిగిలిన వివరాలకు 8008788776, 8309626619, 809608560 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

యానాం వార్తలు


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఎంఎల్ఎ అశోక్

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణి చేశారు. స్థానిక కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా ఈ ల్యాప్‌టాప్ లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ల్యాప్ టాప్‌లను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు కేవలం విద్యాపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రతలు వహించాలని కోరారు. త్వరలో జరగబోయే పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు. పరీక్షలకు సమయం తుక్కువగా ఉందని, విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి, సర్వశిక్షా అభియాన్ అధికారి కమిడి ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ కె.ఉమ, పిఇటి పాలికి స్వామి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం


వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని 95 మందికి వృద్ధాప్య ఫించన్లు, 90 మందికి వికలాంగ ఫించన్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మానసికంగా ధృడంగా ఉండాలని కోరారు. వికలాంగులకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెయ్య శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.